సాక్షి సంగారెడ్డి

బుధవారం । 27 । మార్చి । 2024



ఉచిత విద్యుత్.. బడికి భవిష్యత్

ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా విద్యుత్ అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

వివరాలు 8లో ▸



పరిశ్రమలో అగ్నిప్రమాదం

పాశమైలారం పారిశ్రామికవాడలోని ఎన్విరో వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో మంగళవారం అగ్ని ప్రమాదం సంభవించింది.

వివరాలు 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
బుధవారం (సాయంత్రం)	గురువారం (ఉదయం)
06:35	04:51

న్యూస్‌రీల్

తాగునీటి సమస్య పరిష్కారానికి కంట్రోల్ రూమ్

సంగారెడ్డి టౌన్ : సంగారెడ్డి జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో తాగు నీటి సమస్య పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ క్రాంతి మంగళవారం తెలిపారు. ఏ గ్రామంలోనైనా తాగునీటి సమస్య ఉన్నట్లయితే 08455276155 నంబర్లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు తెలిపారు.

తొలివిడత ర్యాండమైజేషన్ పూర్తి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి టౌన్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్టు కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీసీ హాల్లో ఎన్నికలకు సంబంధించిన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలు జరగనున్న రీత్యా 8,363 మందిని మొదటి విడత రాండమైజేషన్ ద్వారా పోలింగ్ సిబ్బందిని కేటాయించామన్నారు. వీరికి శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, రెవెన్యూ అధికారి పద్మజారాణి, విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ క్రాంతి అన్నారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో భాగంగా పోస్టల్‌బ్యాలెట్ ప్రక్రియ నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో కలిసి ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ ఎవరికి వర్తిస్తుందనే స్పష్టమైన అవగాహన అధికారులు కలిగి ఉండాలన్నారు. ఎన్నికల రోజున విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి ఫారం 12 అందించాలన్నారు. సీవిజిల్ యాప్, 1950 టోల్ ఫ్రీ నంబర్ ను ఉపయోగించి రాజకీయ పార్టీ నాయకుల ప్రలోభాలను సమాచారం అందించాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేకంగా ఉంచాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి టౌన్: జిల్లాల్లో గ్రూప్ 1, 2, 3, 4, ఎస్సై, కానిస్టేబుల్ తదితర ఉద్యోగాల కోసం ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మూడు నెలల ఫౌండేషన్ కోర్సుకు గానూ ఉచిత శిక్షణ ఇవ్వనున్నారని, ఈ నెల 28 వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు వసతితో కూడిన శిక్షణ ఉంటుందని తెలిపారు. డిగ్రీ మార్కుల మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 94404-78004, 98499-07051 నంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

సొంత నిధులతో ట్రస్టు

బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి



మాట్లాడుతున్న వెంకట్రాంరెడ్డి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : మెదక్ ఎంపీగా గెలిపిస్తే రూ.వంద కోట్ల సొంత నిధులతో పీవీఆర్ ట్రస్టును ఏర్పాటు చేసి.. నిరుపేద విద్యార్థులకు ఉచితంగా విద్యనందిస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి పి.వెంకట్రామిరెడ్డి హామీ ఇచ్చారు. లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సొంత నిధులతో ఫంక్షన్ హాలులు కట్టించి పేదలకు ఉచితంగా వేడుకలను చేసుకునేందుకు అవకాశం కల్పిస్తానన్నారు. మంగళవారం సంగారెడ్డిలో జరిగిన మెదక్ లోక్‌సభ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల మద్దతుతోనే సిద్దిపేట కలెక్టర్‌గా ఐదేళ్లు ఒకే చోటా పని చేయగలిగానన్నారు. తాను రాజకీయాల్లోకి డబ్బుల కోసం రాలేదని, ప్రజలకు సేవ చేసేందుకే వచ్చానని స్పష్టం చేశారు. 25 ఏళ్ల పాటు జాయింట్ కలెక్టర్‌గా, కలెక్టర్‌గా, గ్రూప్-1 ఆఫీసర్‌గా సేవ చేశానని, ఎంతో మంది సమస్యల పరిష్కారం కోసం కృషి చేశానన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో బీఆర్ఎస్ బలంగా ఉందని, ప్రజలు ఆశీర్వదిస్తారనే నమ్మకం ఉందన్నారు. తమ మనిషిగా ఉంటానని, ఎంపీగా ప్రజా సేవ చేసుకునే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునీతా లక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఫారూక్ హుస్సేన్, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, నాయకులు రాజేశ్వర్‌రావుదేశ్‌పాండే, పట్నం మాణిక్యం, కాసాల బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధే దిక్కాయె



చెరువులో మట్టి పూడిక తీత పనుల్లో ఉపాధి కూలీలు

కరువు పరిస్థితులు నెలకొనడం.. బతుకు భారమవడంతో చాలా మంది 'ఉపాధి'బాట పడుతున్నారు. సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలో గత ఏడాది ఇదే సమయంలో 3,221 మంది ఉపాధి హామీ పనులకు హాజరయ్యారు. ఈసారి ఈ సంఖ్య ఏకంగా 3,707కు పెరిగింది. గత ఏడాది కంటే అధికంగా 486 మంది ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారు. సుమారు 15 శాతం అధికంగా కూలీలు పనులకు వెళ్లాల్సి వస్తోంది. అంటే ఉమ్మడి జిల్లాలో కరువు ఛాయలు నెలకొన్నాయనడానికి ఇది చక్కని ఉదాహరణ.

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి:

వ్యవసాయ పనులు లేక.. ఈజీఎస్ పనులకు వెళ్తున్న కూలీలు

- సుమారు 15 శాతం పెరిగిన కూలీల సంఖ్య
- యాసంగిలో నెలకొన్న కరువే కారణం

ఉమ్మడి జిల్లాలో ఉపాధి హామీ పనులకు వెళ్తున్న కూలీల సంఖ్య పెరుగుతోంది. యాసంగిలో కరువు పరిస్థితులు నెలకొనడంతో కూలీలకు వ్యవసాయ పనులు దొరడం లేదు. దీంతో వీరికి ఉపాధి హామీ పనులే దిక్కవుతున్నాయి. ఈసారి యాసంగిలో అనుకున్న స్థాయిలో వర్షాలు కురవలేదు. దీనికి తోడు ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతుండటంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. చాలా చోట్ల బోర్లు వట్టిపోతున్నాయి. కొన్నింటిలో నీటి ధార తగ్గిపోతోంది. పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ఈ కారణంగా కూలీలకు వ్యవసాయ పనులు దొరకడం లేదు. దీంతో వ్యవసాయ పనులపై ఆధారపడిన కూలీలు ఉపాధి పనుల వైపు మొగ్గు చూపుతున్నారు.

గిట్టుబాటు కాని కూలి

నిరుపేద కూలీల వలసలను నివారించి.. వారికి స్థానికంగా పనులు కల్పించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ ఉపాధి హామీ పథకం అమలు చేస్తున్న విషయం విదితమే. ప్రస్తుతం చెరువుల్లో మట్టి పూడిక తీత పనులు, రాళ్ల కట్టలు కట్టడం, డైవర్షన్ కాలువ పూడిక తీత పనులు ఎక్కువగా కొనసాగుతున్నాయి. ఎండల తీవ్రతకు నేల గట్టిగా మారిపోయింది. ఈ గట్టి పడిన నేలను తవ్వడానికి కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. రోజంతా కష్టపడితే కనీసం రోజుకు రూ.180కి మించి కూలి రావడం లేదని కూలీలు వాపోతున్నారు. మండే ఎండలను సైతం లెక్కచేయకుండా పని చేస్తున్నా కూలి గిట్టుబాటు కాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. పని చేసే ప్రదేశంలో మంచి నీరు, టెంట్లు కానరావడం లేదు. తాగునీటి అలవెన్సు ఇస్తున్నామనే సాకుతో కూలీలకు తాగునీటి సౌకర్యం కూడా కల్పించడం లేదు.

ఉపాధి పనులు ఇలా..

- సంగారెడ్డి జిల్లాలో మొత్తం 2.2 లక్షల జాబ్‌కార్డులున్నాయి. ప్రస్తుతం 2.39 లక్షల మంది పనులకు వెళ్తున్నారు. రోజుకు సగటున రూ.180 చెల్లిస్తున్నారు.
- మెదక్ జిల్లాలో మొత్తం1.64 లక్షల జాబ్‌కార్డులున్నాయి. 2.24 లక్షల మంది ఉపాధి హామీ పనులకు హాజరవుతున్నారు. కూలీలకు రోజుకు సగటున రూ. 191 కూలి గిట్టుబాటు అవుతోంది.
- సిద్దిపేట జిల్లాలో 2.01 లక్షల జాబ్‌కార్డులు ఉండగా, ప్రస్తుతం 2.38 లక్షల మంది ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారు. రోజుకు సగటున రూ.175 చెల్లిస్తున్నారు.



వ్యవసాయ పనుల్లేక..



వ్యవసాయ పనులు దొరకడంలేదు. ఉపాధి హామీ పనులకు వెళ్తున్నాం. వర్షాలు సరిగ్గా కురవకపోవడంతో ఈసారి పంటల సాగు అంతంతే.. బతుకు భారం కావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఈ పనులకు వెళ్తున్నాం. పని జరుగుతున్న చోట సరైన సౌకర్యాలు లేవు. నీలువ నీడ లేక ఇబ్బందులు పడుతున్నాం.

– నిరూడి కేశయ్య, కూలీ, కల్హేర్, సంగారెడ్డి జిల్లా

సౌకర్యాలు కల్పించాలి



ఉపాధి హామీ పనులు చేస్తున్నాం. కానీ పని ప్రదేశంలో ఎలాంటి సౌకర్యాలు లేవు. గతంలో పని ప్రాంతం దగ్గర నీళ్లు, తట్ట గడ్డపారలు అన్ని అందించేవారు. రెండేళ్లుగా వాటిని అందించడం లేదు. ఏదైనా దెబ్బ తగిలితే ప్రథమ చికిత్స చేసుకునేందుకు కూడా మెడికల్ కిట్టు అందుబాటులో లేదు. ఎండ నుంచి ఉపశమనం కోసం నీడ సదుపాయం లేదు. గతంలో మాదిరి సౌకర్యాలు కల్పించాలి.

– గ్యార కిషన్, ఉపాధి కూలీ, రాఘవాపూర్, సిద్దిపేట జిల్లా

ఎండలోనే పనిచేస్తున్నాం



పంటలు ఎండిపోతుండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఉపాధి హామీ పనులకు వెళుతున్నాం. పనులు చేసే ప్రదేశంలో ఎలాంటి సదుపాయాలు కల్పించడం లేదు. ఎండలోనే పనిచేయవలసి వస్తోంది. పనులు జరిగే చోట కూలీల కోసం ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటు చేయాలి. కానీ ఎవరు పట్టించుకోవడం లేదు.

– లంబాడి హరి, బాపనయ్య మోతుకుల తండా, మెదక్ జిల్లా

నేను పార్టీ మారడం లేదు



కొడిపల్లి: మదన్‌రెడ్డిని ఆయన స్వగృహంలో కలిసిన ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, సునీతారెడ్డి

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్)/నర్సాపూర్: నేను పార్టీ మారటం లేదని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కౌడిపల్లికి వచ్చిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రచారం జరుగుతోందని, సీఎంఆర్ఎఫ్ ఇతర అభివృద్ధి పనుల కోసం మైనంపల్లి హన్మంతరావును ఓ ఫంక్షన్‌లో కలిశానన్నారు. అయితే మైనంపల్లిని ఆయన ఇంటి వద్ద కలిసి కాంగ్రెస్‌లో చేరేందుకు చర్చలు జరిగినట్లు ప్రచారం జరుగుతుందని విలేకరులు ప్రశ్నించగా.. అభివృద్ధి పనుల కోసమే ఆయన్ను కలిసినట్లు వెల్లడించారు. మాజీ ఎమ్మెల్యే వెంట ఎంపీపీ ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్తా, డీసీసీబీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ దుర్గారెడ్డి, రాజుయాదవ్, శ్రీనివాసరావ్ తదితరులు ఉన్నారు.

మైనంపల్లితో మదన్‌రెడ్డి భేటీ

కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హన్మంతరావుతో బీఆర్ఎస్ నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి భేటీ అయ్యారు. మంగళవారం సాక్షి ప్రచురించిన 'కాంగ్రెస్ వైపు మదన్‌రెడ్డి చూపు' కథనం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. కాగా కాంగ్రెస్‌లో చేరేందుకు గాను సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అనుచరుల వద్ద ఇటీవల ఆయన చర్చలు జరిపారని తెలిసింది. ఆ మేరకు కాంగ్రెస్ అధిష్టానం సూచనల మేరకు మంగళవారం మైనంపల్లి హన్మంతరావు అనుచరుడు కొంపల్లి ఏరియాలో నివాసం ఉండే మెదక్‌కు చెందిన ఉప్పల రాజేశానికి చెందిన ఇంట్లో వారు కలుసుకొని చర్చలు జరిపారు. ఇందులో త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ లోక్‌సభ కాంగ్రెస్ టికెట్ ఇప్పించాలని మదన్‌రెడ్డి హన్మంతరావును అడిగారని సమాచారం. మైనంపల్లి కూడా ముఖ్యమంత్రితో అపాయింట్‌మెంట్ తీసుకుని అక్కడికి తీసుకుపోతానని, ఈ విషయాన్ని సీఎంతోపాటు పార్టీ ఢిల్లీ నాయకత్వం నిర్ణయిస్తుందని, అప్పటివరకు ఎలాంటి హామీ ఇవ్వలేనని హన్మంతరావు అన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. మదన్‌రెడ్డి వెంట శివ్వంపేట పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, డీసీఎంఎస్ ఉపాధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, మరో బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్‌రావులు ఉన్నారని సమాచారం. కాగా మెదక్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ టికెట్ ఇచ్చినా ఇవ్వక పోయినా బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడానికి మదన్‌రెడ్డి నిర్ణయించుకున్నారని ఆయన అనుచరులు తెలిపారు.

బుజ్జగించిన హరీశ్‌రావు

మదన్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రచారం కావడంతో మాజీ మంత్రి హరీశ్‌రావు ఆయన్ను కలిసి రహస్య మంతనాలు జరిపారు. మంగళవారం కౌడిపల్లిలోని మదన్‌రెడ్డి స్వగృహంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి, ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్‌లతో కలిసి ఆయన ప్రత్యేకంగా ఒక గదిలో చర్చించారు. బీఆర్ఎస్‌ను వీడవద్దని బుజ్జగింపులు చేసినట్లు సమాచారం. పెద్దాయన బాగోగులు తాము చూసుకుంటామని హరీశ్ అక్కడ ఉన్నవారితో చెప్పారు. అయినప్పటికీ మదన్‌రెడ్డి మాత్రం ప్రతికూలంగానే మాట్లాడినట్లు సమాచారం. కొద్దిసేపు తర్వాత అక్కడి నుంచి వెంకట్రాంరెడ్డితో కలిసి హరీశ్ మెదక్ వెళ్లిపోయారు. అలాగే మదన్‌రెడ్డి వైద్యపరీక్షల కోసం హైదరాబాద్ వెళ్తున్నట్లు చెప్పి వెళ్లిపోయారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక

సిద్దిపేటజోన్: జాతీయ స్థాయి యోగా పోటీలకు ఇద్దరు ఎంపిక అయ్యారు. యోగాసన భారత్ ఆధ్వర్యంలో ఈనెల 29 నుంచి 31వరకు తమిళనాడులోని కోయంబత్తూరులో జరిగే నాల్గవ జాతీయ స్థాయి పోటీలకు సిద్దిపేటకు చెందిన ఇద్దరికి అవకాశం లభించింది. గత ఏడాది సెప్టెంబర్‌లో హైదరాబాద్, కద్వాల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో చిప్ప ప్రభాకర్, పల్లె సురేష్ లు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. 45 నుంచి 55 ఏళ్ల వయస్సు విభాగంలో వీరిద్దరూ ఎంపిక అయ్యారు. వీరి ఎంపిక పట్ల యోగాసన అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ రావు, జిల్లా ప్రతినిధులు అభినందించారు.

5కే రన్



5కే రన్ ను ప్రారంభిస్తున్న ఆర్డీఓ పాండు

జోగిపేట (అందోల్) : ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం జోగిపేటలో 5కే రన్ నిర్వహించారు. కార్యక్రమాన్ని అందోల్ జోగిపేట ఆర్డీఓ పాండు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, ఎస్ఐ-2 మొగులయ్య, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటమి భయం

- బీజేపీ అభ్యర్థి మంచివాడైతే దుబ్బాకలో గెలిచేవాడు
- మాజీ మంత్రి హరీశ్‌రావు



మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

మెదక్: ఓటమి భయం కాంగ్రెస్ నేతల్లో పట్టుకుందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. అందుకే రోజుకో నాయకుడి ఇంటికి వెళ్లి పార్టీలో చేర్చుకుంటున్నారన్నారు. మెదక్ జిల్లా బీఆర్ఎస్‌కు కంచుకోటన్నారు. మంగళవారం మెదక్ పట్టణంలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు మంచివాడైతే దుబ్బాకలో ప్రజలు గెలిపించేవారని, అలా జరగలేదని ఓటమి చవిచూశారన్నారు. వందరోజుల కాంగ్రెస్ పాలన అందరికీ అర్థమైందని, ఆపార్టీ పని అయిపోయిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తెలంగాణ ప్రజలను మోసం చేస్తోందని అన్నారు. పింఛన్లు, ఉచిత విద్యుత్, రుణమాఫీ, పంటలకు బోనస్ ఇలా ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని విమర్శించారు. వంద రోజుల పాలన చూసి ఓటు వేయాలంటున్న కాంగ్రెస్ ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుతుందని ప్రశ్నించారు. గతంలో కొత్త ప్రభాకర్‌రెడ్డిని రాష్ట్రంలోనే అతిపెద్ద మెజార్టీతో మెదక్ ఎంపీగా గెలిపించిన చరిత్ర ఈ జిల్లాకే దక్కిందని గుర్తు చేశారు. అదే తరహాలో మరోసారి వెంకట్రాంరెడ్డిని గెలిపించాలని ఇందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. అనంతరం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ, తనను గెలిపిస్తే ప్రజలందరికీ అందుబాటులో ఉంటానన్నారు. తాను సేవ చేయాలనే దృక్పథంతో రాజకీయాల్లోకి వచ్చానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరిసుభాష్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హేమలత, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు చంద్రపాల్, మల్లికార్జున్‌గౌడ్‌లు, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆక్రమణలకు అడ్డేదీ?

- 20 కుంటల పార్కు స్థలం, మరో 20 కుంటల ప్రభుత్వ స్థలం ఆక్రమణ
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు





రాజంపేటలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి, (ఇన్‌సెట్) కబ్జా బారిన పార్కు స్థలం

సంగారెడ్డి: యథేచ్ఛగా ప్రభుత్వం స్థలాలు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. వాటిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు, కాలనీవాసులు విమర్శిస్తున్నారు. వీరికి రాజకీయ నేతల అండదండలు ఉన్నాయని తెలుస్తోంది. దీంతో కోట్లు విలువ చేసే భూముల్లో ప్లాట్లు వేసి అమాయకులకు అంటగడుతున్నారు. గతేడాది ఈ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు అడ్డుకోగా మరలా చేపడుతున్న పరిస్థితి పట్టణంలో కనిపిస్తోంది.

పట్టణంలో పార్కు కోసం వదిలిన భూమి ఆక్రమణకు గురైంది. ఎంప్లాయి కాలనీలో ఇళ్ల నిర్మాణం కోసం 1980లో సర్వే నంబర్ 374/1లో 2 ఎకరాల 20 గుంటల భూమిని అప్పటి కలెక్టర్ కేటాయించారు. ప్లాట్లు వేయగా పోను 20 గుంటల స్థలాన్ని కాలనీ పార్కు కోసం వదిలారు. విలువ సుమారుగా రూ. 2 కోట్లు ఉంటుందని అంచనా. దీనిపై కన్నేసిన కొందరు ప్రజాప్రతినిధులు ప్లాట్లుగా చేసి అమ్మేశారు. కొనుగోలుదారులు అందులో నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయమై అధికారులకు కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగి సర్వే చేయగా ఆక్రమణ జరిగిందని తేలింది. గత మార్చిలో ఆక్రమణ జరిగిన స్థలంలోని నిర్మాణాలు ఆపాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం స్థానిక ప్రజాప్రతినిధుల అండతో తిరిగి అందులో నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు.

అలాగే రాజంపేట ప్రధాన రహదారికి ఆనుకొని గాలి పోచమ్మ గుడి వరకు సర్వేనంబర్ 374లో ప్రభుత్వం భూమి ఉంది. అందులో 20 గుంటల వరకు ఆక్రమణకు గురైంది. నాలుగు గుంటలు రిజిస్ట్రేషన్ కూడా చేయించారు అక్రమార్కులు. మిగతా 16 గుంటలు స్థలం ఆక్రమణకు గురైంది. గతంలో ఈ విషయమై స్థానికులు ఫిర్యాదు చేస్తే మండల రెవెన్యూ అధికారులు ఇది ప్రభుత్వ భూమి అని ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక బోర్డు పెట్టారు. ప్రస్తుతం ప్రైవేట్ వ్యక్తులు బోర్డును పడేసి ఇక్కడ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. వీరికి రాజకీయ నాయకుల అండ ఉండటంతో అధికారులు చర్యలు తీసుకునేందుకు జంకుతున్నారని స్థానికులు చెబుతున్నారు. కాగా, రాజంపేటలో కందకం స్థలాన్ని సైతం.. కబ్జా చేసుకొని ఒక వ్యక్తి ఇల్లు నిర్మించారు. దీంతో వాహన దారులు, పాదాచారులు ఇబ్బంది పడుతున్నారు. కందకం స్థలంలో 33 ఫీట్ల రోడ్డు నిర్మించాల్సి ఉందని కాలనీవాసులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని ఆయా స్థలాల్లో అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

పరిశ్రమలో అగ్ని ప్రమాదం


మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పటాన్‌చెరు టౌన్: పరిశ్రమలో అగ్ని ప్రమాదం సంభవించిన ఘటన పటాన్‌చెరులో చోటు చేసుకుంది. అగ్నిమాపక అధికారి జన్య నాయక్ కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామిక వాడలోని ఎన్విరో వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో మంగళవారం మధ్యాహ్నం సమయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఐదు ఫైరింజన్‌లతో మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో ఎవరూ గాయపడలేదని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

రైసుమిల్లు వ్యాపారిపై కేసు

ప్రభుత్వానికి రూ.44.56 కోట్లు బకాయి

నర్సాపూర్: సీఎంఆర్ బియ్యం చెల్లించనందుకు ఓ రైసుమిల్లు వ్యాపారిపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నర్సాపూర్‌కు చెందిన వ్యాపారి పాండురంగానికి మండలంలోని పెద్దచింతకుంటలో రైసుమిల్లు ఉంది. ఆయన 2021 నుంచి ప్రభుత్వం నుంచి వడ్లు తీసుకొని సీఎంఆర్ కింద బియ్యం చెల్లించ నందున ప్రభుత్వానికి రూ.44 కోట్ల 56 లక్షలు బకాయి పడ్డారని తహసీల్దార్ కమలాద్రి తెలిపారు. ఇప్పటికే ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారని, ఇచ్చిన గడువు లోపల బకాయిలు చెల్లించని పక్షంలో ఆర్‌ఆర్‌ఆక్ట్ అమలు చేసి బకాయిలు వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసినప్పటి నుంచి వ్యాపారి పాండురంగం పరారీలో ఉన్నారని తెలిసింది.

రూ.2.33 లక్షలు సీజ్

నంగునూరు(సిద్దిపేట): ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా కారులో తరలిస్తున్న డబ్బును సీజ్ చేసినట్లు (ఎఫ్‌ఎస్‌టీ) ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం అధికారి ఎంపీడీఓ హరి ప్రసాద్ తెలిపారు. ముండ్రాయి వెంకటాపూర్ గ్రామాల మధ్య మంగళవారం వాహనాల తనిఖీల్లో చేర్యాల మండలం ఆకునూర్‌కు చెందిన రేసు బాలమల్లు కారును తనిఖీ చేశామన్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.2,33,900 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. నగదును కలెక్టర్ కార్యాలయంలోని గ్రీవెన్స్‌సెల్‌లో డిపాజిట్ చేస్తామని, ఆధారాలు చూపించి డబ్బును రిలీజ్ చేసుకోవచ్చన్నారు. స్క్వాడ్ బృందం హెడ్ కానిస్టేబుల్ తిరుపతిరెడ్డి, కానిస్టేబుళ్లు పరుశరాములు, రాజు పాల్గొన్నారు.

విద్యార్థినితో ఇన్విజిలేటర్ అసభ్యకర ప్రవర్తన

దుద్దెడ పరీక్ష కేంద్రంలో ఘటన

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలోని దుద్దెడ హైస్కూల్లో పదవ తరగతి పరీక్ష కేంద్రంలో మంగళవారం విద్యార్థినితో ఇన్విజిలేటర్ భాకి చంద్రభాను అసభ్యకరంగా ప్రవర్తించాడంటూ పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌కు విద్యార్థిని ఫిర్యాదు చేసింది. దీని వల్ల పరీక్ష సరిగా రాయలేకపోయాయని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయం పరీక్ష కేంద్రం ప్రాంతంలో ప్రచారం కావడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఇన్విజిలేటర్ విధుల నుంచి తప్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను కోరారు. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ లక్ష్మిని వివరణ కోరగా ఇన్విజిలేటర్ అసభ్యకరంగా ప్రవర్తించిన విషయం దృష్టికి వచ్చిందని, కాకపోతే లిఖిత పూర్వక ఫిర్యాదు అందలేదన్నారు.

మృతదేహం లభ్యం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ మండలం తూంకుంట అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. బీట్ ఆఫీసర్ ఎరుపుల భాస్కర్ కొంత మంది కూలీలను తీసుకొని తూంకుంట అటవీ ప్రాంతంలో పనులు చేయిస్తుండగా కాల్వలో కుళ్లిపోయిన స్థితిలో గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే బీట్ ఆఫీసర్‌కు సమాచారం ఇవ్వగా శవాన్ని చూసి జహీరాబాద్ రూరల్ పోలీసులకు తెలిపారు. మృతదేహం వయస్సు సుమారు 60 ఏళ్లు ఉంటుందని బీట్ ఆఫీసర్ ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ ప్రసాద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత విద్యుత్.. బడికి భవిష్యత్

ప్రభుత్వ పాఠశాలలో అమలుకు ప్రభుత్వం శ్రీకారం

- తప్పనున్న బిల్లుల భారం
- వివరాలు సేకరిస్తున్న విద్యాశాఖ సిబ్బంది
- జిల్లా వ్యాప్తంగా 1,253 పాఠశాలలు

ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా విద్యుత్ అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వం ఏటా నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ అవి సరి పోకపోవడంతో విద్యుత్‌బిల్లులు చెల్లించడం ప్రధానో పాధ్యాయులకు భారంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగించుకుంటున్న ఇళ్లకు గృహజ్యోతి పథకం కింద జీరో విద్యుత్‌బిల్లులు జారీ చేస్తున్నట్లుగా విద్యా సంస్థలకు కూడా ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని భావిస్తోంది. ఇప్పటికే వివరాల సేకరణలో విద్యాశాఖ నిమగ్నమైంది. – కొండాపూర్ (సంగారెడ్డి)

జిల్లా వ్యాప్తంగా 1253 పాఠశాలలున్నాయి. వీటిలో 846 ప్రభుత్వ ప్రాథమిక, 199 ప్రాథమికోన్నత, 203 ఉన్నత, 5 ఎయిడెడ్ పాఠశాలలున్నాయి. ప్రభుత్వం వీటి నిర్వహణ నిమిత్తం ప్రతీయేటా విద్యార్థుల సంఖ్యను బట్టి రూ.10 వేల నుంచి రూ.75 వేల వరకు చెల్లిస్తోంది. రూ.50 వేలు, అంతకన్న ఎక్కువ నిధులు వచ్చే పాఠశాలలు చాలా తక్కువ సంఖ్యలో ఉండగా, కేవలం రూ.25 వేలలోపు వచ్చే పాఠశాలలు ఎక్కువగా ఉన్నాయి. ఈ నిధులు కూడా సంవత్సరంలో రెండు విడతలుగా చెల్లిస్తుండడంతో ప్రధానోపాధ్యాయులకు ఇబ్బందులు తప్పడం లేదు. వచ్చిన నిధులను కేవలం విద్యుత్ బకాయిలకే కాకుండా సంవత్సరం పొడవునా వివిధ అవసరాలకు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

బిల్లులు మోపెడు..

గతంలో పాఠశాల తరగతి గదుల్లో ఫ్యాన్‌లు కూడా అందుబాటులో లేకపోవడంతో విద్యుత్ బిల్లు చాలా తక్కువగా వచ్చేది. కానీ ప్రస్తుతం పాఠశాలల్లో మొక్కలకు ఇతర అవసరాలకు బోరుబావి నీటిని వినియోగిస్తున్నారు. కంప్యూటర్, ప్రయోగశాలలు, తరగతి గదులు, ఉపాధ్యాయుల గదుల్లో ఫ్యాన్లు, డిజిటల్ తరగతులకు ప్రొజెక్టర్లను వినియోగిస్తున్నారు. మన ఊరు–మన బడి కింద ఎంపికైన పాఠశాలలకు ఇంటరాక్టీవ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డు అందజేశారు. వీటన్నింటి వినియోగంతో విద్యుత్ బిల్లులు మోపెడు అవుతోంది. పాఠశాలల స్థాయిని బట్టి సుమారు రూ.2 వేల నుంచి రూ.7 వేల వరకు బిల్లులు వస్తున్నాయి.


శివంపేట్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

బిల్లు భారం తప్పనుంది



రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేయాలని నిర్ణయించడం చాలా సంతోషం. విద్యుత్ బకాయిలు ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రస్తుతం డిజిటల్ తరగతులు, ప్రొజెక్టర్ ద్వారా పాఠాలు బోధించడం, పాఠశాలలో మొక్కలు పెంచడం వంటి కార్యక్రమాల వల్ల విద్యుత్ బిల్లులు తడిసి మోపెడు అవుతుంది. సీఎం నిర్ణయంపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నాం.
–తుకారాం, ప్రధానోపాధ్యాయుడు, కంకోల్ ఉన్నత పాఠశాల

వివరాలు సేకరణ

ప్రభుత్వం తాజాగా సర్కారు బడులకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించడంతో పాఠశాలలపై ఇకపై నుంచి భారం తప్పనుంది. ఇప్పటికే పాఠశాలల్లో ఫిబ్రవరికి ముందు ఉన్న పెండింగ్ బిల్లులు, ఫిబ్రవరిలో వచ్చిన విద్యుత్ బిల్లుల వివరాల సేకరించాలని ఇప్పటికే ఉపాధ్యాయులకు సూచించారు. ఎమ్మార్సీ, సీఆర్సీ సిబ్బంది ప్రధానోపాధ్యాయుల ద్వారా వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.

వడ్డీ అదనం

ప్రభుత్వం పాఠశాల నిర్వహణ నిధులు చాలా రోజులుగా సమయానికి విడుదల చేయడం లేదు. ప్రధానోపాధ్యాయులు భారీగా వస్తున్న విద్యుత్ బిల్లులను తర్వాతి నెలలో చెల్లిస్తామని వాయిదాలు వేస్తున్నారు. దీంతో బిల్లుల చెల్లింపులో ఆలస్యమవుతోంది. బిల్లు సమయానికి చెల్లించకపోవడంతో విద్యుత్ శాఖ ఏడు శాతం చొప్పున వడ్డీ వేస్తుంది. దీంతో బిల్లుల చెల్లింపులు ప్రధానోపాధ్యాయులకు గుది బండగా మారింది.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగినిపై

ప్రిన్సిపాల్ వేధింపులు

నిందితుడిపై కేసు నమోదు

జోగిపేట (అందోల్): కళాశాలలో ఉద్యోగం చేయాలంటే తనకు పడక సుఖం అందించాలని, లేదంటే ఉద్యోగానికి రాజీనామా చేయాలని ప్రిన్సిపాల్ వేధిస్తున్నాడని అందోల్ మహిళ పాలిటెక్నిక్ కళాశాల ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. లొంగకపోయే సరికి తన విధుల విషయంలో అనవసర తప్పిదాలు వెతికి ఉద్యోగానికి రాజీనామా చేయాలని బెదిరింపులకు పాల్పడుతున్నాడని వాపోయింది. గతంలో సస్పెండ్ అయిన జూనియర్ అసిస్టెంట్ వర్క్‌కు సంబంధించి తనకు ఎలాంటి సంబంధం లేకపోయినా లెటర్ రాసి వివరణ ఇవ్వాలని బ్లాక్ మెయిలింగ్ చేస్తూ తనను లోబర్చుకోవడానికి యత్నిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. వేధింపులను మరింతగా అధికం చేయడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని పేర్కొంది.

ఎలాంటి తప్పు చేయలేదు: ప్రిన్సిపాల్
మహిళా ఉద్యోగినిపై తాను ఎలాంటి తప్పు చేయలేదని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు విలేకరులతో మాట్లాడారు. ఆమె చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవమని పేర్కొన్నారు. తాను తప్పు చేసి ఉంటే శాఖాపరంగా ఎలాంటి చర్యలు తీసుకున్నా అంగీకరిస్తానని తెలిపారు. ఔట్ సోర్సింగ్ వారిని ఉద్యోగం నుంచి తీసివేస్తారనే అభద్రతాభావంతోనే ఆమె ఇలాంటి చర్యలకు పూనుకుందని స్పష్టం చేశారు.

డీఎస్పీ వద్దకు తీసుకెళ్లిన పోలీసులు
ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, బాధితురాలు వీరబిలను వేర్వేరుగా సంగారెడ్డి డీఎస్పీ కార్యాలయానికి తీసుకెళ్లారు. ఉదయం ప్రిన్సిపాల్‌పై ఫిర్యాదు చేసినా బాధితురాలు డీఎస్పీ సత్తయ్య దృష్టికి తీసుకెళ్లడంతో వారిద్దరిని సంగారెడ్డికి తీసుకెళ్లినట్లు జోగిపేట ఎస్‌ఐ అరుణ్ కుమార్ గౌడ్ తెలిపారు. నిందితుడు శ్రీనివాసులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కాల్వలో మట్టి నింపితే ఎలా?

- నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయ్
- పోలీసులతో కొండపాక రైతుల ఆవేదన
- మట్టిని తొలగించడానికి వెళ్తుండగా అడ్డుకొని స్టేషన్‌కు తరలింపు

కొండపాక(గజ్వేల్): తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి కొండపాక మండలానికి సాగు నీరు రాకుండా కాల్వలో పోసిన మట్టిని తొలగించేందుకు వెళ్తున్న రైతులను మంగళవారం పోలీసులు అడ్డుకొని పోలీ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. దేవాదుల ప్రాజెక్టు నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్ డీ4 కెనాల్ ద్వారా కొండపాక మండలానికి సాగు నీరు అందించేందుకు గతంలో కాల్వ నిర్మించారు. తిమ్మారెడ్డిపల్లి శివారులో ఉన్న కాల్వలో చేర్యాల తదితర పట్టణాల కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల అండదండలతో రైతులు మట్టిని అడ్డుగా పోశారని, దీంతో కొండపాక మండలానికి నీరు రాక పంటలు ఎండిపోతున్నాయని సీఐ లతీఫ్‌కు రైతులు వివరించారు. ఈ విషయం రిజర్వాయర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు. స్పందించిన సీఐ వెంటనే ఈ విషయాన్ని పోలీస్ ఉన్నతాధికారి, తపాస్‌పల్లి రిజర్వాయర్ డీఈఈ అంజయ్య దృష్టికి ఫోన్ ద్వారా వివరించారు. పోలీస్ ఉన్నతాధికారి సూచనల మేరకు బుధవారం ఉదయం మట్టిని తొలగించి కొండపాక మండలానికి నీరు అందేలా చూస్తామంటూ సీఐ రైతులకు నచ్చజెప్పారు. కార్యక్రమంలో గజ్వేల్ సీఐ, కుకునూరుపల్లి ఎస్సై, పోలీసులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్వేషకర పోస్టులు పెడితే కేసులు

సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: సోషల్ మీడియాలో విద్వేషకర, తప్పుడు పోస్టులు పెట్టినా, రాజకీయ విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా పోస్టులు, ఫొటోలు మార్ఫింగ్ చేసినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పోస్టులు పెట్టినా చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉందన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను ప్రజలు నమ్మకూడదని సూచించారు. సామాజిక మాధ్యమాలను వేదికగా విద్వేషకర పోస్టులు చేసే వారి సమాచారాన్ని సిద్దిపేట పోలీసు కమిషనర్ కంట్రోల్ రూం నంబర్ 87126 67100 కు సమాచారం అందించాలని సూచించారు.

సంజీవ్ కృషి అభినందనీయం
విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, మెంటల్ హెల్త్ అవేర్‌నెస్, డ్రగ్స్ అవేర్‌నెస్, ఆత్మహత్యల నివారణ వంటి అనేక అంశాలపై అవగాహన కల్పించిన కెరియర్ కోచ్ సంజీవ్‌కుమార్ సేవలను గుర్తించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ అవార్డు అందజేసింది. పోలీసు కమిషనర్ కార్యాలయంలో సీపీ అనురాధ చేతుల మీదుగా మంగళవారం ఈ అవార్డును అందుకున్నారు. యువతను శక్తివంతం చేయడంలో సంజీవ్ కృషి అభినందనీయమని తెలిపారు.


అవార్డు అందజేస్తున్న సీపీ అనురాధ

అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టి...

రోడ్డు ప్రమాదంలో హార్వెస్టర్ డ్రైవర్ మృతి

నారాయణఖేడ్: డీసీఎం వ్యాను అదుపుతప్పి జాతీయ రహదారి అడ్డుగోడను ఢీకొట్టడంతో వ్యానులోని హార్వెస్టర్‌పై నిద్రిస్తున్న డ్రైవర్ మృతి చెందిన ఘటన ఖేడ్‌లో చోటు చేసుకుంది. ఖేడ్ ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన నిజాంపేట నుంచి హార్వెస్టర్‌ను లోడ్ చేసుకొని డీసీఎం వ్యాను మంగళవారం తెల్లవారు జామున సంగారెడ్డి–నాందేడ్–అకోలా 161 నంబరు జాతీయ రహదారి గుండా బాచేపల్లి వైపు వెళ్తుంది. నిజాంపేట దాటాక వేగంగా వెళ్తున్న డీసీఎం అదుపుతప్పి డివైడర్‌ను దాటి రోడ్డు అడ్డుగోడను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎంలో ఉన్న పంటకోత యంత్రంపై నిద్రిస్తున్న డ్రైవర్ రాజాసాబ్ (40) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.


ప్రమాదానికి గురైన డీసీఎం

పండుగ నింపిన విషాదం

- గల్లంతైన యువకులు మృతదేహమై లభ్యం
- హోలీ రోజు చెరువులో స్నానానికి వెళ్లిన స్నేహితులు
- గుమ్మడిదల మండలంలో తీవ్ర విషాదం
- మృతుల్లో ఒకరు పదవ తరగతి

జిన్నారం(పటాన్‌చెరు): ఈత సరదా ఇద్దరి ప్రాణాలను బలికొన్నది. గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడ గ్రామంలో సోమవారం చెరువులో మునిగి ఇద్దరు యువకులు గల్లంతైన విషయం తెలిసిందే. కాగా ఈ ఇద్దరు యువకుల మృతదేహాలు మంగళవారం చెరువులో లభ్యమయ్యాయి. గుమ్మడిదల ఎస్‌ఐ మహేశ్వరెడ్డి కథనం ప్రకారం.. సూరారంలోని నివాసం ఉంటున్న శ్రావణ్(16), శంకర్(22)లతోపాటు మరో పది మంది స్నేహితులు హోలి పండుగను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం స్నానం చేసేందుకు వీరన్నగూడ గ్రామంలోని వీరన్న చెరువు వద్దకు వెళ్లారు. తోటి స్నేహితులు స్నానం చేసి బయటకు రాగా శ్రవన్, శంకర్‌లు చెరువులోకి వెళ్లి బయటకు రాలేదు. గజ ఈతగాళ్లతో వెతికించినా ఆచూకీ లభ్యం కాలేదు. మంగళవారం వీరిద్దరి మృతదేహాలు చెరువులో తేలాయి. మృతుడు శ్రావణ్ పదవ తరగతి చదువుతున్నాడు. పరీక్షలు ఉన్నా, తల్లిదండ్రులు చెబుతున్నారా వినకుండా సరాదా కోసం ఈతకు వెళ్లడంతో ఆ ఇంట విషాదం నెలకొంది. మృతులు ఇద్దరూ వరుసకు అన్నాదమ్ముళ్లు అవుతారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ తెలిపారు.


శ్రావణ్, శంకర్ (ఫైల్)

ఇంద్రేశం చెరువులో మరో యువకుడు
పటాన్‌చెరు టౌన్: హోలీ వేడుక స్నానానికి వెళ్లిన ఓ వ్యక్తి స్నేహితుడిని రక్షించబోయి నీటిలో మునిగిపోయి గల్లంతైన ఘటనలో మంగళవారం మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామానికి చెందిన దాదాపు పది మంది స్నేహితులు సోమవారం హోలీ సంబురాలు జరుపుకున్నారు. అనంతరం ఇంద్రేశం గ్రామ శివారు సదర్ చెరువులో స్నానానికి వెళ్లారు. చెరువులో ఉన్న పుట్ట ఎక్కిన శివ అనే స్నేహితుడిని కాపాడబోయి బండి రాజేశ్ గల్లంతు కాగా, గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. మంగళవారం తిరిగి గజఈతగాళ్ల సాయంతో గాలింపు చేపట్టగా ఉదయం మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిని చంపిన కుమారుడు

తాగిన మైకంలో దారుణం


దేవమ్మ(ఫైల్)

హవేళీఘణాపూర్(మెదక్): తల్లిని కుమారుడు కొట్టి చంపిన ఘటన మంగళవారం మెదక్ మండలం రాజ్‌పల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దేవమ్మ(60) కుమారుడు నారాయణ, భార్య లావణ్య, ఇద్దరు కుమారులతో కలిసి కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం హోలీ పండుగ జరుపుకున్న నారాయణ సాయంత్రం స్నానానికి ఇంటికి వచ్చాడు. మద్యం మత్తులో ఉన్న కొడుకుని తల్లి దేవమ్మ ఇలా నిత్యం తాగితే సంసారం ఎలా నడుస్తుందని ప్రశ్నించింది. దీంతో ఆగ్రహానికి గురైన అతడు ఇటుక రాయితో తల్లి తలపై బలంగా కొట్టాడు. దీంతో తీవ్ర గాయాలై దేవమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు విషయం తెలుసుకున్న మెదక్ రూరల్ సీఐ కేశవులు ఘటనా స్థలాన్ని పరిశీలించి నారాయణను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

కుక్కల దాడిలో 28 గొర్రెలు మృతి

మరో 15 జీవాలకు గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్): ఊర కుక్కల దాడిలో గొర్రెలు మృతిచెందిన ఘటన మండల పరిధి గోమారం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోటు కుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బండ యాదయ్య గొర్రెలు పెంచుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. ఎప్పటిలాగే గొర్రెలను పాకలో ఉంచాడు. అర్ధరాత్రి ఊర కుక్కలు పాకలోకి చొరబడి గొర్రెల మందపై దాడికి పాల్పడ్డాయి. ఈ దాడిలో 28 గొర్రెలు మృతి చెందగా, మరో 15 గొర్రెలు గాయపడ్డాయి. మృతి చెందిన గొర్రెల విలువ రూ.3 లక్షలు ఉంటుందని బాధిత రైతు బండ యాదయ్య బోరున విలపించాడు. గ్రామ శివారులో కోళ్ల వ్యర్థాలు వేస్తుండడంతో వాటికి అలవాటు పడిన కుక్కలు గొర్రెల పై దాడికి పాల్పడినట్లు గ్రామస్తులు అన్నారు. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ నాయకులు మాధవరెడ్డి, హన్మంతరెడ్డి, భిక్షపతిరెడ్డి కోరారు.


గొర్రెల వద్ద విలపిస్తున్న బాధిత రైతు

పేకాట స్థావరంపై దాడి

ఏడుగురిపై కేసు నమోదు

సిద్దిపేటకమాన్: పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు, సిద్దిపేట టూటౌన్ పోలీసులు దాడి చేశారు. ఈ ఘటన సిద్దిపేట పట్టణ శివారులో చోటు చేసుకుంది. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రంగీలాదాబా సమీపంలో కొంతమంది అక్రమంగా పేకాట ఆడుతున్నారనే సమాచారం అందింది. టాస్క్‌ఫోర్స్ పోలీసులు, టూటౌన్ పోలీసులు తమ సిబ్బందితో వెళ్లి మంగళవారం దాడులు చేశారు. అక్రమంగా పేకాట ఆడుతున్న పట్టణానికి చెందిన పోచయ్య, యాదగిరి, కైసర్ అలీ, మహమ్మద్ షరీఫ్, బి.శ్రీను, మహమ్మద్ ఫరూక్, బస్వాపూర్‌కు చెందిన సంజీవరెడ్డిలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.8,564, ఐదు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ ఉపేందర్ తెలిపారు.

కరెంటు షాక్‌తో చేపలు పట్టబోయి..

చివరకు విద్యుదాఘాతంతో తానే మృతి


దుబ్బయ్య మృతదేహం

మిరుదొడ్డి(దుబ్బాక): కరెంటుతో షాకిచ్చి చేపలు పట్టబోయి చివరికి అదే కరెంటు కాటుకు మత్స్యకారుడు బలైన ఘటన అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని కూడవెల్లి వాగులో చోటు చేసుకుంది. మృతుడి బంధువులు, గ్రామస్తులు, భూంపల్లి ఎస్‌ఐ రవికాంత్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మత్స్యకారుడు ఎనగంటి దుబ్బయ్య (56) కూలి పనులు చేసుకుంటూనే, అప్పుడప్పుడూ కూడవెల్లి వాగులో చేపలు పడుతూ భార్యా పిల్లలను పోషించుకునేవాడు. కరెంటు షాక్ ఇచ్చి చేపలు పట్టడంలో దుబ్బయ్య ఆరితేరిన వాడు. ఎప్పటి మాదిరిగానే సోమవారం సాయంత్రం కూడవెల్లి వాగు చెక్ డ్యాం సమీపంలో చేపలు పట్టడానికి రామేశ్వరంపల్లి గ్రామానికి చెందిన మరో వ్యక్తి రాజయ్య తో కలిసి వెళ్లాడు. అలవాటు ప్రకారం ఇనుప రింగ్‌కు కరెంటు సరఫరా ఇచ్చి చేపలు పట్టడానికి ఉపక్రమించాడు. నీటిలో చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు కరెంటు షాక్‌కు గురై విలవిలలాడాడు. గమనించిన రాజయ్య వైరు తొలగించే ప్రయత్నం చేస్తుండగానే దుబ్బయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడు..


ప్రశాంత్(ఫైల్)

మనూరు(నారాయణఖేడ్): విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని బోరంచ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బైండ్ల ప్రశాంత్(26) స్థానిక నల్లపోచమ్మ ఆలయం వద్ద చిన్నపాటి హోటల్ నడిపిస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజువారి పనిలో భాగంగా హోటల్‌లోని ఫ్రిజ్‌ను శుభ్రం చేస్తున్న క్రమంలో కరెంట్ షాక్‌కు గురయ్యాడు. గమనించిన చుట్టుపక్కల వారు చికిత్స నిమిత్తం నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు.

రైలు కింద పడి..


మహేశ్ (ఫైల్)

రామాయంపేట(మెదక్): రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన రాత్రి అక్కన్నపేట రైల్వేస్టేషన్ వద్ద చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, కామారెడ్డి రైల్వే ఎస్‌ఐ తావూనాయక్ కథనం మేరకు.. మెదక్ పట్టనానికి చెందిన మొకిరే మహేశ్ (28)కు ఎనిమిదేళ్ల కిందట మెదక్ మండలం నాగాపూర్‌కు చెందిన జ్ఞానేశ్వరితో వివాహమైంది. వీరికి పాపతోపాటు బాబు ఉన్నారు. మూడేళ్లుగా జ్ఞానేశ్వరి కాపురానికి రావడం లేదు. హమీలీగా పని చేసే మహేశ్ కుటుంబ సమస్యలతో సతమతమవుతున్నాడు. సోమవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిన మహేశ్ కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి తాను అక్కన్నపేట రైల్వేస్టేషన్ వద్ద ఉన్నానని, తన కోసం ఎవరూ చూడొద్దని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. అదే రాత్రే వారు అక్కన్నపేట వచ్చి వాకబు చేయగా జాడ తెలియరాలేదు. ఉదయం రైల్వేస్టేషన్ సమీపంలో మహేశ్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డట్టు సమాచారం అందింది. కామారెడ్డి రైల్వే ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆడుకుంటూ బిల్డింగ్ పైనుంచి పడి బాలుడు..


బాలుడి మృతదేహం

నంగునూరు(సిద్దిపేట): స్నేహితులతో కలిసి బిల్డింగ్‌పై ఆడుకుంటున్న బాలుడు కిందపడి మృతి చెందిన ఘటన మంగళవారం పాలమాకులలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన రైసాబేగం భర్త ఎండీ సత్తర్ గతంలో మృతి చెందడంతో కూలీ పనులు చేస్తూ ఇద్దరు కుమారులతో కలిసి డబుల్ బెడ్‌రూంలో నివాసం ఉంటోంది. ఆరవ తరగతి చదువుతున్న పెద్ద కుమారుడు హర్మన్ (11) స్నేహితులతో కలిసి బిల్డింగ్‌పై ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

చెరువులో అనుమానాస్పదంగా..

చిలప్‌చెడ్(నర్సాపూర్): అనుమానాస్పదంగా యువకుడు మృతి చెందిన ఘటన చిలప్‌చెడ్ మండలం చండూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గట్టుమీది నర్సింలు (20) మృతదేహం గుండం చెరువులో గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించా. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.